ఉదయ్‌కుమార్‌కు ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 21: ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు విభాగంలో మీసాల ఉదయ్‌కుమార్ డాక్టరేట్ సాధించారు. ప్రొఫెసర్ వెల్దండ నిత్యానందరావు పర్యవేక్షణలో 'పెద్దింటి అశోక్‌కుమార్ నవలలు.. సమగ్ర పరిశీలన'అనే అంశంపై పరిశోధన పూర్తి చేసి ఉదయ్‌కుమార్ సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచి అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. 2017లో యూజీసీ జూనియర్ రీసర్చ్ ఫెలోషిప్ సాధించి, తన పరిశోధనను ప్రారంభించారు. 2018 తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన పరీక్షల్లో గురుకుల ఉపాధ్యాయుడిగా ఎంపికై ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఆయన నల్లగొండ జిల్లా అనుముల మండలం చిత్తగూడెం గ్రామానికి చెందిన వారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధ్యాపకులు, అధికారులు అభినందించారు.

అన్నదానం: మారేడ్‌పల్లిలోని శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఓం నమ:శివాయ గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ పాలక మండలి సభ్యుడు చొల్లేటి రమేష్, సభ్యులు కోదరపు కృష్ణలు ప్రారంభించారు. ప్రతి మంగళవారం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించడం ఎంతో అభినందనీయమని చొల్లేటి అన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు జి. రాంబాబు, బి. సురేష్ పాల్గొన్నారు.– మారేడ్‌పల్లి

రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం

- సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని రూ.48 లక్షలు మంజురూ చేయించారు..
- అయినా ముందుకు కదలని రోడ్డు పనులు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు

బోయిగూడలో మధ్యలోనే ఆగిపోయిన రోడ్డు నిర్మాణ పనులను చూపిస్తున్న స్థానికుడు

బన్సీలాల్‌పేట్, మే 21 : బోయిగూడలోని ఉప్పలమ్మ దేవాలయం నుంచి చాచా నెహ్రూనగర్ కమ్యూనిటీ హాలు వరకు చేపట్టిన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం నెలకొన్నది. దీనికోసం మాజీ మంత్రి ,సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ రూ.48 లక్షలు మంజూరు కూడా చేయించారు. అయినా పనులు కొనసాగక పోవడంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలల క్రితం మొదలైన పనులు ఇంకా పూర్తి కాలేదు. మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు స్థానికుల కోరిక మేరకు ఈ రోడ్డు ఏర్పాటుకు నిధులను మంజూరు చేశారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు పూర్తి అయినా రోడ్డు పనులు మాత్రం పూర్తి కాలేదని స్థానిక కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై జీహెచ్‌ఎంసీ అసిస్టెంట్ ఇంజినీర్ నవీన్ కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా చాచా నెహ్రూనగర్ వైపు నుంచి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించామని, డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వరకు పూర్తి చేశామని బదులిచ్చారు. డ్రైనేజీ, తాగునీటి పైపులైన్లు పగలడంతో వాటికి మరమ్మతులు చేయించామని, త్వరలో శ్రీనివాస హోటల్ వరకు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు.

టీఎస్ - సెట్ పరీక్ష ఫీజు తగ్గించాలి

ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 21: ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తున్న తెలంగాణ స్టేట్ లెవల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సెట్) రిజిస్ట్రేషన్ ఫీజులను తగ్గించాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు సెట్ మెంబర్ సెక్రెటరీ ప్రొఫెసర్ నరేశ్‌రెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ .. సెట్ అర్హత పరీక్షకు హాజరుకాబోయే విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేయడం అన్యాయమన్నారు. జనరల్ కేటగిరికి రూ.2 వేలు, బీసీలకు రూ.1500, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌లకు రూ.1000 ఫీజు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఎటువంటి ఫెలోషిప్‌లు ఇవ్వకుండా, విద్యార్థుల నుంచి భారీగా ఫీజులు వసూలు చేయాలని భావించడం భావ్యం కాదన్నారు. ఆ ఫీజులు చెల్లించలేక విద్యార్థులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని వాపోయారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో సామాన్య, మధ్య తరగతి, నిరుపేద విద్యార్థులకు సెట్ అర్హత సాధించాలనే కల కలగానే మిగిలిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అభ్యర్థులు ఒకే సబ్జెక్టులో మాత్రమే పరీక్ష రాయాలనే నిబంధన ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఎల్ మూర్తి, రవినాయక్, ఆంజనేయులు, శ్రీకాంత్, కృష్ణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి : బన్సీలాల్‌పేట్‌లో జరిగిన హరితహారంలో భాగంగా మొక్కలు నాటి నీరు పోస్తున్న బీఆర్ఎస్ నాయకులు కే.లక్ష్మీపతి, రజాక్, రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్, వెంకటేశ్ తదితరులు– బన్సీలాల్‌పేట్, మే 21

అనాథ ఆశ్రమంలో.. స్వామి వివేకానంద సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకపాక సూర్యనారాయణ 67వ జయంతి సందర్భంగా బోయిగూడలోని బాలికల అనాథ ఆశ్రమంలో మంగళవారం అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రాజు, ఎస్.వినయ్‌కుమార్, సభ్యులు పాల్గొన్నారు. – బన్సీలాల్‌పేట్

పొగాకుతో యేటా 10 లక్షల మరణాలు

అమీర్‌పేట్, మే 21 : పొగాకు ఉత్పత్తులను సేవించడం వల్ల ప్రతి 8 క్షణాలకు ఒకరు మృత్యువాత పడుతున్నారని శ్రీ సాయి ఓరల్ హెల్త్ చారిటబుల్ ట్రస్ట్, గాంధీ దవాఖాన మాజీ ఆర్ఎంవో డాక్టర్ ఓ.నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. మన దేశంలో ప్రతి ఏడాది 10 లక్షల మందికి పైగా ఈ పొగాకు ఉత్పత్తుల కారణంగా నోటి క్యాన్సర్ బారిన పడుతూ మృతి చెందుతున్నారని నివేదికలు సూచిస్తున్నాయని తెలిపారు. మే 1 నుండి 31 వరకు జరిగే 'ప్రపంచ పొగాకు వ్యతిరేక మాసోత్సవాలు'ను ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తూ పొగాకు ఉత్పత్తుల వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరిస్తూ యువకులు, పెద్దలకు కరపత్రాలు అందిస్తూ అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మంగళవారం ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీ శ్రీనివాసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత మధ్యాహ్న మిత భోజన శిబిరం వద్ద కూడా యువకులు, పెద్దలకు అవగాహన కల్పిస్తూ పొగాకు అనర్థాలను సూచించే బ్యానర్‌తో ర్యాలీ నిర్వహించారు.

అవగాహన కల్పిస్తున్న శ్రీసాయి ఓరల్ హెల్త్ ట్రస్ట్ ప్రతినిధులు

వీసీ పాలన ముగియడంతో..సంబురాలు

విద్యార్థులను అడ్డుకున్న పోలీసులు

ఉస్మానియా యూనివర్సిటీ, మే 21: ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ దండెబోయిన రవీందర్‌యాదవ్ పదవీ కాలం ముగియడంతో వివిధ బహుజన విద్యార్థి సంఘాలు, ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో సంబురాలు జరుపుకున్నారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో విద్యార్థి నాయకులు మాట్లాడుతూ.. ఓయూలో తుగ్లక్ పాలన ముగిసిందని ఆనందం వ్యక్తం చేశారు. పిచ్చోడి చేతిలో రాయిలా రవీందర్ పాలన సాగిందని మండిపడ్డారు. చెత్త వీసీలలో ఆయన మొదటి స్థానంలో నిలుస్తారని ఎద్దేవా చేశారు. ఆయన నుంచి ఓయూకు విముక్తి కలిగిందని అభిప్రాయపడ్డారు. వర్సిటీలో విద్యాపరమైన అభివృద్ధి కుంటుపడిందన్నారు. అభివృద్ధి పేరిట ఓయూను తన వ్యక్తిగత, ఆర్థిక, రాజకీయ అవసరాలు, స్వలాభం కోసం ఓయూను ఉపయోగించుకున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో రాజీలేని పోరాటం చేసిన విద్యార్థి నాయకులు రాష్ట్రం ఏర్పాటు తరువాత ఉద్యోగాలు చేసుకుంటే వారిని తొలగించారని గుర్తు చేశారు. ఓయూ భూములు అన్యాక్రాంతం అవుతున్నా ఏనాడూ పట్టించుకోలేదని విమర్శించారు. విలువైన ఓయూ భూములను లీజుల పేరిట ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారని ఆరోపించారు. విద్యార్థులు మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతుంటే తను మాత్రం రాజరికం వెలగబెట్టేందుకు నూతన భవన నిర్మాణం చేపట్టాడని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి, పోమాల అంబేద్కర్, చంద్రశేఖర్, పోతరాజు వెంకటేశ్వర్లు, నవీన్, ప్రవీణ్, శ్రీను, సత్యం, రాజేందర్, అవినాశ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా నివాళి

కంటోన్మెంట్ ఒకటో వార్డు బోయిన్‌పల్లి నేతాజీ నగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం సీనియర్ నాయకులు ముప్పిడి మధుకర్,జంపన ప్రతాప్ ఆధ్వర్యంలో ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో ముకేష్,రామారావు,శ్రీకాంత్,రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు. – కంటోన్మెంట్,మే 21

మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా బోయిగూడలో ఆయన చిత్రపటానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు వేదప్రకాశ్ యాదవ్, నిరంజన్, శ్యామ్‌రావు, డివిజన్ కమిటీ అధ్యక్షుడు చిరంజీవి తదితరులు కలిసి పూలమాల వేసి నివాళులర్పించారు. – బన్సీలాల్‌పేట్, మే 21 :

వీసీ పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలి

డాక్టర్ బోయ కుమార్

ఉస్మానియా యూనివర్సిటీ, మే 21: ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా మూడేళ్ల పదవీ కాలం పూర్తి చేసుకున్న ప్రొఫెసర్ దండెబోయిన రవీందర్ యాదవ్ తన పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని ఓయూ ఎస్సీ, ఎస్టీ నాన్‌టీచింగ్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బోయ కుమార్ డిమాండ్ చేశారు. బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఊదరగొట్టిన రిఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్, పర్‌ఫార్మ్ ఎక్కడున్నాయో చెప్పాలని సవాల్ విసిరారు.

ఈ – గవర్నెన్స్ (పేపర్ రహిత పాలన) అమలు చేస్తున్నామని బడాయి మాటలు చెప్పారని అది ఎక్కడ అమలవుతుందో చెప్పాలన్నారు. తన మానస పుత్రికగా చెప్పుకునే 21 పాయింట్ ఎజెండా ఎక్కడ ఉందో చెప్పాలని ఎద్దేవా చేశారు. ఓయూ సెక్యూరిటీ గార్డులపై నెలవారీ ఖర్చు 2021కి ముందు ఎంత ఉండేది, ఇప్పుడు ఎంత ఉందో చెప్పాలని కోరారు. తన మొత్తం పదవీ కాలంలో ఓయూ ఎంత మంది డైరెక్టర్లను నియమించారని, ఆ సంఖ్య 2021లో ఎంత ఉందో చెప్పాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం

కాచిగూడ, మే 21 : ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి యాదయ్యమాదిగ అన్నారు. మంగళవారం బర్కత్‌పురలో ఆ యన మాట్లాడుతూ.. మాదిగ విద్యార్థులు కేంద్ర ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మాదిగలు అభివృద్ధి చెందాలంటే జనాభా ప్రాతిపదికన ఎస్సీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీలుగా వెంటనే వర్గీకరించాలన్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లుతున్నాడన్నారు.

అసంఘటితరంగ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్‌నగర్, మే 21: అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ కోరారు. మంగళవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ రంగాలను నిర్వీర్యం చేస్తూ ప్రైవేట్ రంగాలను ప్రోత్సహిస్తూ కార్పొరేట్ శక్తులకు అండగా నిలుస్తున్నాయన్నారు.

నగరంలో ఎక్కడపడితే అక్కడ చెత్త దర్శనమిస్తున్నది. దానిలో భాగంగా సికింద్రాబాద్‌లోని శివాజీనగర్‌లో రోడ్డు పక్కన చెత్త పడేయడంతో పశువులు వాటిని చెల్లాచెదారం చేస్తున్నాయి. అంతేకాకుండా ఆ దారి గుండా పోయే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే సంబంధిత సిబ్బంది చెత్తను తొలగింపజేసి పరిశుభ్రతకు కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

60 ఏళ్ల వ్యక్తి మెడలో కణితి తొలగింపు

అమీర్‌పేట్, మే 21: వయోభారంతో పాటు బీపీ, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న 60 ఏళ్ల వ్యక్తికి మెడ నుంచి భుజం వరకు వ్యాపించిన కణితిని అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రి సర్జన్ డాక్టర్ రవూఫ్ ఆధ్వర్యంలో వైద్య బృందం శస్త్రచికిత్స నిర్వహించి విజయవంతంగా తొలగించింది. 2 కేజీలు ఉన్న ఈ కణితి తొలగింపుతో రోగికి ఉపశమనం కలిగింది. క్లిష్టమైన ఈ శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలు డాక్టర్ రవూఫ్ వెల్లడించారు. ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన పెంటయ్య (60)కి 15 సంవత్సరాల క్రితం మెడ భాగంలో చిన్న కణితి ఏర్పడింది. అది కాస్తా పెరుగుతూ భుజం వరకు వ్యాపించింది. దీంతో పెంటయ్యకు ఈ కణితి కారణంగా నిద్ర పోయేందుకు ఇబ్బందులు ఎదురయ్యేవి. అయితే అమీర్‌పేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయని తెలిసి పెంటయ్య ఆ దవాఖానకు రాగా, అక్కడి వైద్యులు శస్త్రచికిత్స నిర్వహించి కణితిని తొలగించడం జరిగిందని, ఇప్పుడు రోగి కోలుకున్నాడని తెలిపారు.

పుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

జూబ్లీహిల్స్: రోడ్లు, పుట్‌పాత్‌లను ఆక్రమణలు చేస్తే చర్యలు తీసుకుంటామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ రాణి హెచ్చరించారు. మంగళవారం యూ సుఫ్‌గూడ సర్కిల్‌లో రోడ్లపై ఆక్రమణల తొలగింపునకు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణకాంత్ మాట్లాడుతూ..పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా.. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వీధి వ్యాపారాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలి

ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంహెచ్‌ఓ

ముషీరాబాద్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటి

ముషీరాబాద్, మే 21: ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ జె. వెంకటి ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది హాజరు, వైద్య సేవలు అందిస్తున్న తీరును పరిశీలించిన ఆయన వసతులు, రికార్డుల నమోదు తీరును తనిఖీ చేశారు. చిన్నారులకు టీకాలు, గర్భిణులకు అందిస్తున్న సేవలను ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది విధిగా సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యంవహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో వైద్య సేవల విస్తరణ, సీజనల్ వ్యాధులను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఇప్పటి నుంచే అధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశామని, అవసరమైన మందులు అందుబాటులో ఉంచడం జరిగిందన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుతున్న మెరుగైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ ప్రొగ్రాం ఆఫీసర్ డాక్టర్ అశ్రిత, ముషీరాబాద్ పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ దీప్తిప్రియాంక, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీసంగీత విభావరి

శౌర్య మ్యూజిక్ అండ్ ఎంటర్టైన్మెంట్ సంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన సినీ సంగీత విభావరి పలువురినీ అలరించింది. గాయకులు ఇందు, దివ్య, ప్రతిభ, వినయ్, హరి, శోభన్‌బాబు, శ్రీనివాస్‌రెడ్డి, శరత్ ఆలపించిన మధుర గీతాలు రంజింపచేశాయి. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు స్నేహ హసంతి, గాయని గాయకులు రమ్య, యోగిత, గోవార్యన్ నాగేందర్‌రావులను సత్కరించారు.

- ముషీరాబాద్

మొబైల్స్ చోరీకి యత్నించిన వ్యక్తిపై కేసు

బంజారాహిల్స్ గదిలోకి ప్రవేశించి మొబైల్ ఫోన్స్ చోరీ చేసేందుకు ప్రయత్నించిన వ్యక్తిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. షేక్‌పేటలో ఉంటున్న మోనుకుమార్ అనే యువకుడు పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తుంటాడు. గదిలో తన స్నేహితుడు కన్నయ్యకుమార్‌తో కలిసి నిద్రపోతున్న సమయంలో అలికిడి వినిపించింది. గుర్తుతెలియని వ్యక్తి గదిలోకి ప్రవేశించి రెండు సెల్ ఫోన్లు, హెడ్‌ఫోన్లు చోరీ చేసి బయటకు వెళ్తున్నట్లు గుర్తించిన మోనుకుమార్ అతడిని పట్టుకున్నాడు. ఫిలింనగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదుతో ఐపీసీ 379 రెడ్‌విత్ 511 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.